29-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - వజ్ర సమానమైన జీవితాన్ని తయారుచేసుకునేందుకు తండ్రిని చాలా సంతోషముగా స్మృతి చేయండి, అప్పుడు తుప్పు వదిలిపోతుంది"

ప్రశ్న:- మాలలో మణిగా ఎవరు అవుతారు, అందుకు పురుషార్థం ఏమిటి?

జవాబు:- ఎవరికైతే అంతిమంలో ఏదీ గుర్తుకు రాదో వారే మాలలో మణిగా అవుతారు. ఇటువంటి పిల్లలు ఎవరైతే కర్మాతీత అవస్థను పొందుతారో వారే మాలలో మణిగా అవుతారు. కొందరు చాలా ధనవంతులు ఉంటారు, అనేక కర్మాగారాలు మొదలైనవి ఉంటాయి... వాటన్నింటినీ మర్చిపోవలసి ఉంటుంది. ఎవరి పట్ల మమకారము ఉండకూడదు. నాది-నాది అనేది ఉండకూడదు. కేవలం వీరు సోదరుడు (ఆత్మ), ఇదే ఆత్మిక కనెక్షన్, ఇంకే కనెక్షన్ ఉండకూడదు. ఇటువంటి ఆత్మిక కనెక్షన్ పెట్టుకునేవారు, అన్నింటినీ మర్చిపోయే పిల్లలే మాలలో రాగలరు.

ఓంశాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు, తప్పకుండా ఇది పక్కా నిశ్చయము ఏర్పడే ఉంటుంది, మేము ఆత్మలము మరియు పరమాత్మ తండ్రికి పిల్లలము, కావున అందరూ సోదరులమే. సోదరులకు తండ్రి డైరెక్షన్ ఇచ్చారు, పతిత-పావనుడిని తండ్రినైన నన్ను స్మృతి చేయండి. మరి స్మృతి చేస్తున్నారా లేక బుద్ధి యోగం వేరే వైపులకు భ్రమిస్తోందా? మాయ తప్పకుండా భ్రమింపజేస్తుంది, వద్దనుకున్నా కూడా మీ బుద్ధి ఎక్కడో ఒక చోటుకు పరిగెడుతూ ఉంటుంది. బాబా మనకు సృష్టి చక్రం యొక్క జ్ఞానము ఇచ్చారు, 84 జన్మల కథను చదివించారు అని పిల్లలకు లోలోపల నడుస్తూ ఉండాలి. ఈ 84 జన్మల చక్రం పూర్తయ్యింది. మనం మళ్ళీ ఇంటికి వెళ్తాము, అనేక సార్లు మనం స్మృతి యాత్రతో పవిత్రముగా అయి ఇంటికి వెళ్ళాము. మీ బుద్ధిలోకి వస్తుంది, మనమంతా పరస్పరములో సోదరులము, ఇందులో దేహము యొక్క విషయమేమీ లేదు. మీరు దేహాన్ని స్మృతి చేయకండి. కేవలం మనం ఆత్మలము - మనమే పావనముగా, సతోప్రధానముగా ఉండేవారము, ఇప్పుడు పతితముగా అయ్యాము కావున వజ్రము వంటి జీవితాన్ని తయారుచేసే తండ్రిని సంతోషముగా స్మృతి చేయాలి, తద్వారా తుప్పు తొలగిపోతుంది. కావున తండ్రి అర్థం చేయిస్తారు, పిల్లలూ, మొట్టమొదట స్వయాన్ని ఆత్మగా భావించండి, ఇది కూడా జ్ఞానము, మళ్ళీ తండ్రిని స్మృతి చేయండి - ఇది విజ్ఞానము ఎందుకంటే ఆత్మ జ్ఞానము నుండి అతీతముగా విజ్ఞానములోకి, శాంతి యొక్క ఇంటికి వెళ్ళాలి. ఆత్మ యొక్క స్వధర్మము కూడా శాంతి మరియు ఇల్లు కూడా శాంతి. కావున మొదట మనం అక్కడికి చేరుకోవాలి. బాబా కూడా అక్కడి నుండే వచ్చి ఉన్నారు. కానీ మనుష్యులకు ఈ విషయాలన్నింటి గురించి తెలియదు.

ఈ పారలౌకిక తండ్రి సమ్ముఖముగా కూర్చుని అర్థం చేయిస్తారు, పిల్లలూ, నేను పరంధామం నుండి పిల్లలైన మీ వద్దకు డ్రామా ప్లాను అనుసారముగా వచ్చి ఉన్నాను, ఎందుకు వచ్చాను? మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళేందుకు. ఇప్పుడు మీరు పతితులుగా, వికారులుగా అయ్యారు. జన్మ-జన్మాంతరాలు వికారాల ద్వారానే జన్మించారు, అందుకే భ్రష్టాచారులు అని అనడము జరుగుతుంది. కావున మనం భ్రష్టాచారి నుండి శ్రేష్ఠాచారిగా ఎలా అవ్వాలి - ఇది తండ్రి అర్థం చేయిస్తారు, పిల్లలూ, నన్ను స్మృతి చేసినట్లయితే పవిత్రముగా, శ్రేష్ఠాచారిగా అయిపోతారు. ఈ స్మృతిలో మీరు అన్నీ చేయవచ్చు. అంతేకానీ, వ్యాపార-వ్యవహారాలు చేయలేరని కాదు.

పిల్లలు తండ్రిని అడుగుతారు, బాబా, మాలలో మణులుగా ఎవరు అవుతారు? పిల్లలూ, ఎవరైతే కర్మాతీత అవస్థను పొందుతారో, మాలలో మణులుగా వారే అవుతారు. వారికి అంతిమంలో ఏదీ గుర్తుండదు. కొందరు చాలా ధనవంతులు ఉంటారు, అనేక ఫ్యాక్టరీలు మొదలైనవి ఉంటాయి... వాటన్నింటినీ మర్చిపోవలసి ఉంటుంది. మీ వద్ద అయితే ఏమీ లేదు. మీకు తెలుసు, మనం తండ్రి యొక్క సంతానము, సోదరులము. మనకు ఎవరిపైనా మమకారము లేదు. నాది-నాది అని అయితే లేదు కదా! కేవలం వీరు సోదరుడు, ఈ కనెక్షన్ మాత్రమే ఉంది, ఇంకే కనెక్షన్ లేదు. దీనినే ఆత్మిక కనెక్షన్ అని అంటారు. మొత్తం ఆయుష్షు అంతా దేహమే గుర్తుకు వచ్చింది, ఆత్మ అయితే ఎవ్వరికీ గుర్తుకు రాలేదు. ఇది కూడా డ్రామా తయారుచేయబడి ఉంది, మరి ఈ విషయాలను తండ్రి అర్థం చేయిస్తారు మరియు పావనంగా అయ్యేందుకు పురుషార్థం చేయిస్తారు. బాబా పిల్లలైన మీకు సమయమైతే ఇస్తారు, కేవలం 8 గంటలు నన్ను స్మృతి చేయండి. అది హద్దు సర్వీస్, ఇది మొత్తం విశ్వము యొక్క సర్వీస్. తప్పకుండా తింటారు, తాగుతారు,

నిద్రిస్తారు, తిరుగుతారు... ఎవ్వరూ రోజంతా అయితే స్మృతి చేయలేరు. మీరు తప్పకుండా ఇప్పుడు అనంతమైన సేవను చేస్తారు. ఎలాగైతే తండ్రి విచార సాగర మథనము చేస్తారో, అలాగే పిల్లలైన మీకు కూడా మథనము చేయడము నేర్పిస్తారు, వీరు చేసేవారు-చేయించేవారు కదా, కావున మీకు చేసే నేర్పిస్తారు. పురుషార్థం చేస్తూ-చేస్తూ మీ విజయమాల తయారవుతుంది. సత్య, త్రేతాయుగాలలో ఎవరైతే వస్తారో, వారు విజయులుగా అవుతారు. మళ్ళీ పాత్రధారులందరూ ఈ నాటకంలో పాత్రను అభినయించేందుకు నంబరువారుగా వస్తారు. అందరూ ఒకేసారి కలిసి రారు. పాత్రధారులైన మీ అందరి నివసించే స్థానము - బ్రహ్మ లోకము, అక్కడి నుండి ఇక్కడకు వచ్చి శరీరాన్ని తీసుకుంటారు. ఈ విషయాలన్నీ చాలా సహజమైనవి, ఇవి పిల్లలైన మీకు మాత్రమే గుర్తుంటాయి. మీ ఇల్లు స్వీట్ హోమ్, సైలెన్స్ హోమ్. ఇంకెవరికీ మీ ఇంటి గురించి తెలియదు. మేము లీనమైపోతామని వారు అంటారు. ఎలాగైతే సాగరము నుండి నీటి బుడగ వెలువడుతుంది, మళ్ళీ అది అందులోనే కలిసిపోతుంది, అలాగే మనం కూడా ఆ బ్రహ్మములో లీనమైపోతాము... మళ్ళీ, ఎక్కడ చూసినా అక్కడ బ్రహ్మమే బ్రహ్మము అని అంటారు. వారు బ్రహ్మమునే ఈశ్వరునిగా భావిస్తారు, అందుకే మీ విషయాలు వారి బుద్ధిలో కూర్చోవు. మీరు వారిని తప్పు అని భావిస్తారు, వారు మిమ్మల్ని తప్పు అని భావిస్తారు, ఎందుకంటే వారి ధర్మము వారిదే. కానీ మీకు తెలుసు, ఆత్మలందరూ శాంతిధామంలోకి తప్పకుండా వెళ్తారు. ఇకపోతే, ప్రతి ఒక్క ఆత్మకు తమ-తమ పాత్ర లభించి ఉంది. దీనినే అద్భుతము అని అంటారు. పిల్లలైన మీరు ఇప్పుడు ఎంతగా సూక్ష్మములోకి వెళ్తారు, ఆత్మ ఎంత చిన్నది, పాత్రను ఎలా అభినయిస్తుంది. కావున ఈ జ్ఞానము ఎలాగైతే తండ్రి వద్ద ఉందో, వారు ఏ విధముగా జ్ఞాన సాగరుడో, అలాగే పిల్లలైన మీ వద్ద కూడా ఉంది, ఇప్పుడు మీరు ఆ విధంగా జ్ఞానవంతులుగా అవుతూ ఉంటారు. వారు భక్తివంతులు, మీరు జ్ఞానవంతులు. భక్తివంతులు అనగా రాత్రిలో ఉండేవారు మరియు జ్ఞానవంతులు అనగా పగలులో ఉండేవారు. అర్ధకల్పం మీరు సుఖధామంలో ఉంటారు, అర్ధకల్పం దుఃఖధామంలో ఉంటారు, వీరిని దూరదృష్టి కలవారు అని అంటారు, మీ బుద్ధి ఇప్పుడు చాలా దూర దూరాల వరకు వెళ్తుంది - ఆత్మలమైన మనం మధురమైన ఇల్లు, బ్రహ్మాండం యొక్క నివాసులము. తండ్రి ఈ మనుష్య సృష్టికి బీజరూపుడు ఎందుకంటే వారు నాలెడ్జ్ ఫుల్, వారిలో వృక్షం యొక్క జ్ఞానము ఉంది. మీరు ఇప్పుడు శరీరం యొక్క భానాన్ని తొలగించుకునేందుకు స్వయాన్ని ఆత్మగా భావిస్తారు. ఇంకే వస్తువు గుర్తుకు రాకూడదు. పూర్తి ఆత్మాభిమానులుగా అవ్వాలి. నేను ఆత్మను, నేను ఆత్మను, ఆత్మకు గుర్తుకు వచ్చేందుకు అసలు నా వద్ద ఇంకేదీ లేదు. అంతిమ కాలములో ఏమేమి స్మృతి చేస్తారో, దాని బట్టి జన్మ తీసుకుంటారు అని అంటూ ఉంటారు, ఒకవేళ ఏదైనా వస్తువు ఉన్నట్లయితే అది తప్పకుండా గుర్తుకు వస్తుంది. ఇది ఆలోచించాల్సిన విషయము. ఒకవేళ ఏదైనా ఉన్నట్లయితే, మిత్ర సంబంధీకులు మొదలైనవారు ఎవరైనా ఉన్నట్లయితే, వారు తప్పకుండా గుర్తుకు వస్తారు. మీరైతే మీదంతా శివబాబాకు ఇచ్చేసారు, ఇది నా వస్తువు అని భావించకండి. ఎప్పుడైతే బాబాకు ఇచ్చేసారో, అవి మీకు మళ్ళీ ఎందుకు గుర్తుకు రావాలి, మీరు మర్చిపోండి. ఒకవేళ అది గుర్తుకు వస్తూ ఉన్నట్లయితే, అది కూడా చివర్లో నష్టం కలిగిస్తుంది. ఇప్పుడు మీకు ఈ కొత్త-కొత్త విషయాలన్నీ లభిస్తాయి. పాత వస్తువులేవీ మీ వద్ద లేవు. ఎలాగైతే పాత వస్తువులు అన్నింటినీ స్మశాన బ్రాహ్మణుడికి ఇచ్చేస్తారు కదా. అలాగే మీరు కూడా తమదంతా ఇచ్చేస్తారు, మళ్ళీ అవి గుర్తుకు రాకూడదు. కేవలం ఇదే గుర్తుండాలి, నేను సోదరుడిని (ఆత్మను), బాబా బిడ్డను, నా వద్ద అసలు ఏమీ లేదు, శరీరము కూడా లేదు. మళ్ళీ కొత్త ప్రపంచంలో అన్నీ కొత్త వస్తువులు లభిస్తాయి. అక్కడైతే వజ్ర-వైఢూర్యాలతో కూడుకున్న మహళ్ళలోకి వెళ్తారు. అది భవిష్యత్తుకు సంబంధించిన విషయము. బాబా అడుగుతారు, పిల్లలూ, మీరేమి అవుతారు, అప్పుడు పిల్లలు అంటారు, బాబా, మేమైతే నారాయణునిగా అవుతాము. ఇది సంతోషకరమైన విషయము కదా. కానీ ఎప్పుడైతే పాత వస్తువేదీ గుర్తుకు రాదో, అప్పుడే మాలలో మణిగా అవుతారు. 108 మాల అయితే రాజ్యానికి సంబంధించినది. మందిరాలలో మళ్ళీ 16,108 మాలను కూడా పెట్టడం జరుగుతుంది. కావున మాలలో మణులుగా చాలామందే అవుతారు. ఎంత త్వరగా వస్తారో, అంతగా సుఖాన్ని పొందుతారు. ఎవరైతే వెనుక వస్తారో, వారు ఇంతటి సుఖాన్ని పొందలేదు, వారి కోసం కొద్ది సమయం సుఖము ఉంటుంది, అలాగే దుఃఖము కూడా కొద్దిగానే పొందుతారు.

కావున బాబా అంటారు, పిల్లలూ, ఈ ఆలోచన పెట్టుకోండి, చివర్లో ఏమీ గుర్తుకు రాకూడదు. ఏదైతే అర్పణ చేసి ఉన్నారో, అది కూడా గుర్తుకు రాకూడదు. తండ్రి అంటారు, ఇక్కడ మిగిలి ఉండిపోయి మళ్ళీ దానికి అక్కడ నేను నింపి ఇవ్వాల్సి వచ్చేటువంటి వస్తువేమీ నేను స్వీకరించను, ఎందుకంటే నేను పేదల పెన్నిధిని. చాలామంది ఇచ్చేసి మళ్ళీ ఎప్పుడైనా ఏ కారణముగానైనా వెళ్ళిపోతే, అడగడము మొదలుపెడతారు. మాయ వారిని పూర్తిగా కాటు వేస్తుంది. లేదంటే ఇలా అంటారు, కొట్టండి లేక ప్రేమించండి, ఈ మస్తానా (ఆత్మిక నషాలో ఉండేవారు), నీ ద్వారాన్ని ఎప్పుడూ వదలడు, ఎప్పుడూ మర్చిపోడు. పిల్లలైన మీరు ఇక్కడ నరుని నుండి నారాయణునిగా అయ్యేందుకు వచ్చారు, మీకు

ఎంత పెద్ద వారసత్వం లభిస్తుంది, మేము ఇస్తున్నాము అని మళ్ళీ ఎందుకు అంటారు. మీరైతే తీసుకుంటారు కదా. మీరు ఏదైనా ఇవ్వండి అని ఎవరు అంటారు. ఇకపోతే, ఎవరైతే ఒక్క పైసా అయినా ఇస్తారో, వారి కోసం అక్కడ మహళ్ళు తయారవుతాయి. ఎలాగైతే సుధాముడు పిడికెడు బియ్యాన్ని ఇచ్చారు. కావున పిల్లలు సుదాముని వలె పప్పు, బియ్యాన్ని తీసుకుని వస్తారు, మాకు మహళ్ళు లభిస్తాయని భావిస్తారు. ఇటువంటి పిల్లలను చూసి తండ్రి చాలా సంతోషిస్తారు. వాహ్! వీరికి కొత్త ప్రపంచంలో మహళ్ళు తయారవ్వనున్నాయి ఎందుకంటే చాలా ప్రేమతో మరియు సద్భావనతో తీసుకువస్తారు. ఇటువంటి పిల్లలది అహో భాగ్యము, చాలా ఉన్నత పదవిని పొందుతారు.

ఇప్పుడు డ్రామా ప్లాన్ అనుసారముగా బాబా మరియు పిల్లలైన మీది అడుగడుగునా కల్పక్రితము ఏ నడవడిక అయితే నడిచిందో, అదే నడుస్తుంది. మీ అడుగడుగునా పదమాలు ఉన్నాయి. దేవతల పాదాలలో పదమాలను చూపిస్తారు, దీనికి కూడా ఏదో అర్థం ఉంటుంది కదా. ఇప్పుడు మీకు పదమాల సంపాదన జరుగుతూ ఉంటుంది. మీరు బాబా వద్దకు పదమా పదమపతులుగా అయ్యేందుకు వస్తారు. కావున మీరు ఇంతటి గొప్ప, గొప్ప, గొప్ప భాగ్యశాలులు, కానీ అందులో కూడా మళ్ళీ నంబరువారు పురుషార్థానుసారముగా ఉన్నారు. మీ పురుషార్థము కల్ప-కల్పము అదే డ్రామా ప్లాన్ అనుసారముగా కొనసాగుతుంది, డ్రామా మీ చేత పురుషార్థం చేయిస్తున్నట్లుగా ఉంటుంది. ఈశ్వరుడు కూడా డ్రామానుసారముగా మీకు మతాన్ని ఇస్తారు. కావున డ్రామాకు వశమై ఉన్నారు కదా. మరి ఈ డ్రామా ఎవరికి వశమై ఉంది? పిల్లలూ, డ్రామా అనాదిగా రచించబడి ఉంది, డ్రామా ఎప్పుడు తయారయ్యింది? అని ఇలా ఎవ్వరూ అనలేరు. ఇది అయితే నడుస్తూనే ఉంటుంది. డ్రామాలో ఈశ్వరుని యొక్క నంబరువన్ మతము లభిస్తుంది, అందుకే దీనిని ఈశ్వరీయ మతము అని అంటారు, అది మిమ్మల్ని దేవతలుగా చేస్తుంది మరియు మనుష్యుల మతము ఛీ-ఛీగా చేస్తుంది. ఈశ్వరీయ మతము ద్వారా మీరు మనుష్యుల నుండి దేవతలుగా అవుతారు. మళ్ళీ 21 జన్మల తర్వాత మనుష్య మతముపై మనుష్యులుగా అవుతారు. ఇప్పుడు ఈ సంగమయుగమే గీతా అధ్యాయము, ఇప్పుడే ప్రపంచం మారుతుంది. కావున ఇది పిల్లల బుద్ధిలో ఉండాలి మరియు పిల్లలు చాలా-చాలా మధురముగా అవ్వాలి. ప్రేమగా నడుచుకోవలసి ఉంటుంది. ఏ పిల్లలైతే శాంతిగా మరియు మధురంగా ఉంటారో, వారి పదవి కూడా ఉన్నతముగా ఉంటుంది. ఇప్పుడు మీకు ఈశ్వరీయ బుద్ధి లభించింది, మేము అనంతమైన బాబాకు సంతానముగా అయ్యాము, బాబా నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నామని మీరు అర్థం చేసుకుంటారు. కావున అపారమైన సంతోషం ఉండాలి. తండ్రి అంటారు, పిల్లలూ, స్వర్గము కన్నా కూడా ఇక్కడ మీది చాలా-చాలా ఉన్నతమైన పదవి. తండ్రి కేవలం మిమ్మల్ని చదివిస్తారు. భగవానువాచ, నేను మిమ్మల్ని డబుల్ కిరీటధారులైన రాజులకే రాజులుగా చేస్తాను, కావున మీ భాగ్యముపై మీకు చాలా సంతోషము ఉండాలి. వాహ్! బాబా వచ్చి మా భాగ్యాన్ని ఎలా తయారుచేస్తున్నారు, రాయి వంటి జీవితాన్ని వజ్ర సమానముగా చేసేస్తారు! అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఉన్నత పదవిని పొందేందుకు చాలా-చాలా శాంతచిత్తులుగా ఉండాలి, మధురముగా అవ్వాలి, అందరితో ప్రేమగా నడుచుకోవాలి.

2. బాబాకు ఏవైతే అర్పణ చేసారో, వాటిని మర్చిపోవాలి, వాటి స్మృతి కూడా రాకూడదు. మేము బాబాకు ఇస్తున్నామని ఎప్పుడూ ఈ సంకల్పము కూడా రాకూడదు.

వరదానము:- బ్రాహ్మణ జీవితంలో కామం మహాశత్రువుతో పాటు దాని సర్వ సహచరులకు కూడా వీడ్కోలునిచ్చే సంపూర్ణ పవిత్ర భవ

బ్రాహ్మణ జీవితంలో కామం మహాశత్రువును జయించేందుకు ఎలాగైతే విశేషమైన అటెన్షన్ పెడతారో, అలాగే దాని సహచరులందరికీ కూడా వీడ్కోలు ఇవ్వండి. చాలామంది పిల్లలు మహాభూతమైన క్రోధాన్ని అయితే పారద్రోలుతారు కానీ క్రోధము యొక్క పిల్లలపై కొంచెం ప్రీతినుంచుతారు. ఎలాగైతే చిన్న పిల్లలు మంచిగా అనిపిస్తారో, అలాగే ఈ క్రోధం యొక్క చిన్న పిల్లలు కూడా అప్పుడప్పుడు ప్రియమనిపిస్తారు, కానీ ఎప్పుడైతే ఏ వికారము యొక్క అంశము ఉండదో, అప్పుడే సంపూర్ణ పవిత్రులు అని అంటారు. ఇటువంటి పక్కా వ్రతము తీసుకోండి, అప్పుడే సత్యమైన బ్రాహ్మణులు అని అంటారు.

స్లోగన్:- సంగమయుగము యొక్క ఆనందాన్ని అనుభవం చేయాలంటే మాయ యొక్క అధీనత నుండి స్వతంత్రులుగా ఉండండి.